క్లుప్తంగా

రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి

సూర్యాపేట: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్యాపేట పట్టణ పరిధిలోని 13వ వార్డు గాంధీనగర్ సమీపంలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎండ వేడిమి తగలకుండా ఈద్గా మొత్తం టెంట్ ఏర్పాటు చేశారు. 10వేల మందిపైనే ఈద్గాకు రానున్నట్లు ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. జగదీష్‌రెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు.

జాజిరెడ్డిగూడెంలో గ్రామోత్సవం

అర్వపల్లి: ఉగాది వేడుకలను పురస్కరించుకొని జాజిరెడ్డిగూడెంలో మంగళవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక యోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో దేవరాజ వాహనంపై నర్సింహస్వామి, అమ్మవార్లు శ్రీదేవి, భూదేవిలను ఉంచి పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవంలో భాగంగా వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో అర్చకులు రాంబాబు అయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాపోలు నర్సయ్యకు నివాళి



నర్సయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

తుంగతుర్తి: కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్ తండ్రి రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాపోలు నర్సయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కొత్తగూడెంలో ఆయన మృతదేహానికి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, కొప్పుల వేణారెడ్డి, గుడిపాటి నర్సయ్య, గోవర్ధన్, ఓరుగంటి సత్యనారాయణ, పెండెం రాంమూర్తి, మద్ది కృష్ణమూర్తి, రేతినేని శ్రీను, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



శంభారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

నూతనకల్: మండల కేంద్రానికి చెందిన యాస శంభారెడ్డి, గుండగాని సత్తెమ్మ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలను మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి బుధవారం పరామర్శించి, మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, నాగం జయసుధ, క్లెం కృష్ణారెడ్డి, కట్టా మల్లారెడ్డి, మహేశ్వరం చంద్రకళ, బండపల్లి సాగర్, జటంగి గణేష్, కందుకూరి శ్రీకాంత్, బంటు బద్రి, నెల్లుట్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఆర్ వాహనం తనిఖీ

చివ్వెంల(సూర్యాపేట): ఎన్నికల విధుల్లో భాగంగా చివ్వెంల మండల పరిధిలోని ఖాసీంపేట గ్రామ శివారులో హైదరాబాద్–విజయవాడ రహదారిపై బుధవారం రాత్రి పోలీసులు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి వాహనాన్ని తనిఖీ చేశారు. ఖాసీంపేట గ్రామంలో ఇఫ్తార్ విందుకు వెళ్లి వస్తుండగా పోలీసులు ఆయన వాహనాన్ని తనిఖీ చేశారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

అర్వపల్లి: రంజాన్ పండుగను పురస్కరించుకొని మండల పరిధిలోని కుంచమర్తి గ్రామంలో ఉన్న మసీదులో ముస్లింలకు బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీధర్, అర్షద్, జానిపాష, ఇమ్రాన్, అమీనుద్దీన్, జమీల్, సోహెల్ పాల్గొన్నారు.

బియ్యం, నిత్యావసర సరుకులు అందజేత

హుజూర్‌నగర్ : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఓపెన్ ఐస్ సొసైటీ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ పట్టణంలోని సీతారాంనగర్, దద్దనాల చెరువు కాలనీలో నాలుగు పేద ముస్లిం కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, రూ 1.వేయి విలువ గల నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఆ సొసైటీ ప్రధాన కార్యదర్శి సులువ శ్రీను, సభ్యులు అబ్దుల్ మజీద్, చందు, శివ శంకర్, లక్ష్మణ్, కృష్ణ, సంపత్, రమేష్, చంటి, హమ్మద్, పాషా, సైదా తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో దేవాలయం రోడ్డు

అర్వపల్లి: అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం రోడ్డులో కొద్ది రోజులుగా వీధి లైట్లు వెలగక అంధకారంగా మారింది. ఈ దారి నుంచే కాసర్లపహాడ్, కొమ్మాల గ్రామాలతో పాటు మూడు మండలాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. సాయంత్రం అయితే ఈ రోడ్డు చీకటిగా మారుతుంది. ఆలయం ఎదుట, అర్వపల్లి–కాసర్లపహాడ్ రోడ్డులో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



అంధకారంగా మారిన కాసర్లపహాడ్ వెళ్లే రోడ్డు



దేవాలయం ఎదుట వెలగని వీధి దీపాలు

తండా రోడ్లకు మహర్దశ

- రూ.3కోట్లతో నిర్మాణ పనులు
- ఎస్‌టీ ఎస్‌డీఎఫ్ ద్వారా నిధులు మంజూరు
- 9 నెలల్లో పనుల పూర్తికి గడువు

అర్వపల్లి: ఎన్నో ఏళ్లుగా తండా గిరిజనులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఎట్టకేలకు తీరనున్నాయి. రోడ్డు లేక తండా ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. పక్కా రోడ్డు సౌకర్యం కల్పించాలని జాజిరెడ్డిగూడెం మండలంలోని తూర్పుతండా, గన్నెనాయక్ తండా గిరిజనులు గతంలో అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఆయా తండాల రోడ్లకుగాను ప్రతిపాదనలు పంపగా నిధులు మంజూరయ్యాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల మూలంగా టెండర్ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం టెండర్ ప్రక్రియను పూర్తి చేసి బీటీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు.



బీటీ రోడ్డు నిర్మాణానికి కంపచెట్లు తొలగిస్తున్న జేసీబీ

రూ.3 కోట్లతో పనులు ప్రారంభం

జాజిరెడ్డిగూడెం మండలంలోని కాసర్లపహాడ్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తూర్పుతండా వరకు 3 కిలోమీటర్ల రోడ్డుకు ఎస్‌టి ఎస్‌డీఎఫ్ నుంచి రూ.2.10 కోట్లు మంజూరయ్యాయి. అదేవిధంగా కొమ్మాల పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గన్నెనాయక్‌తండా వరకు 1.1 కిలోమీటర్ల రోడ్డుకు రూ.89.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో బీటీ నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న మెటల్ రోడ్లను బీటీగా నిర్మించి అవసరమైన చోట్ల బ్రిడ్జిలు నిర్మించనున్నారు. మొత్తం 9 నెలల్లో పనులు పూర్తి చేయనున్నట్లు ఏఈ దనావత్ హరినాయక్ తెలిపారు.

మా కష్టాలు తీరనున్నాయి



మా తండాకు ఇప్పటివరకు సరైన రోడ్డు లేదు. వాహనాల రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు పడితే తండా నుంచి బయటికి వెళ్లలేని పరిస్థితి. వర్షాలు పడి వాగు పొంగితే బయటకు రాలేం. బీటీ రోడ్డుతో మా కష్టాలు తీరనున్నాయి.

– కెతావత్ సైదులు, తూర్పుతండా

పనులు చేపట్టడం సంతోషం



గన్నెనాయక్‌తండాలకు బీటీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం సంతోషకరం. మా తండాల గిరిజనుల కష్టాలు ఇప్పటికి తీరబోతున్నాయి. రోడ్ల నిర్మాణం చేపట్టిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– ధరావత్ మహేష్ తూర్పుతండా

వివాదంలో ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయొద్దని వినతి



వినతిపత్రం అందజేస్తున్న అవిలయ్య, రమేష్

మద్దిరాల: వివాదంలో ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయొద్దని వల్లపు అవిలయ్య, రమేష్ కోరారు. ఈమేరకు బుధవారం మద్దిరాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అమీన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని 434 సర్వే నంబర్ గల భూమి వివాదంలో ఉండడం వల్ల కోర్టును ఆశ్రయించామని, ఎంతో విలువల గల భూమి కావడంతో కాస్తు కబ్జాలో ఉన్న తమ భూమిని కొంత మంది రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కుట్ర చేస్తున్నారని తెలిపారు. కోర్టు తీర్పు వచ్చే వరకు ఎవరికీ రిజిస్ట్రేషన్ చేయొద్దని అన్నారు. ఈవిషయంపై తహసీల్దార్ స్పందిస్తూ కోర్టు ఆర్డర్ లేకుండా ప్రభుత్వ భూమిని గానీ ఇలాంటి భూములను గానీ రిజిస్ట్రేషన్ చేయడానికి లేదని, ఉన్నత అధికారులకు తెలియజేసి వారి ఆదేశాలను పాటిస్తామని తెలిపారు.

అశ్వవాహనంపై ఏకాంబేశ్వరస్వామి ఊరేగింపు



ఏకాంబేశ్వరస్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

నాగారం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నాగారం మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో మంగళవారం రాత్రి ఏకాంబేశ్వరస్వామిని భక్తులు అశ్వవాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు కాశీ వెంకటేశ్వర్లు, రాయప్రోలు హరిప్రసాదశాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

చాకలిగూడెంలో పశువైద్య శిబిరం

అర్వపల్లి: మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామపంచాయతీ ఆవాసం చాకలిగూడెంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. రైతులు తప్పనిసరిగా తమ పశువులకు టీకాలు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ అర్జున్, వీఎల్‌ఓ కేవీఎస్‌ఎస్. పద్మ, గోపాలమిత్రలు కుంభం సురేందర్, సూరారపు అర్జున్, రైతులు సయ్యద్, మరిపెల్లి వెంకన్న, అక్కెనపల్లి సత్తయ్య, రాములు, దొనకొండ బాలయ్య పాల్గొన్నారు.



పశువులకు టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న వెంకటలక్ష్మి మోటార్స్ సిబ్బంది

అర్వపల్లి: సూర్యాపేటలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన కోనేటి సతీష్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతను పనిచేసిన సూర్యాపేటలోని శ్రీవెంకటలక్ష్మి హీరో మోటార్స్ వారు రూ.70వేల ఆర్థికసాయాన్ని బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. వారిలో శ్రీవెంకటలక్ష్మి మోటార్స్ ఎండీ రాచర్ల కమలాకర్ రూ.30 వేలు, మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.20 వేలు, షోరూం సీనియర్ మెకానిక్‌లు, అసిస్టెంట్ మెకానిక్‌లు, పీడీఐలు కలిసి రూ.20వేల చొప్పున మొత్తం రూ.70 వేల నగదును సతీష్ తల్లి ఉపేంద్రకు అందజేశారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ నాగేందర్, జానిపాష, సోమేష్, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

మద్దిరాల: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని సీఐ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మద్దిరాల మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని కుక్కడం, గుమ్మడవెల్లి గ్రామాల్లో సీఆర్పీఎఫ్ జవాన్లతో కలిసి కవాతు నిర్వహించారు. ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ జవాన్లు, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



జవాన్లతో కలిసి కవాతు నిర్వహిస్తున్న సీఐ

నేటి నుంచి శ్రీరామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



సీతారాంపురంలో నూతనంగా నిర్మించిన శ్రీరామచంద్రస్వామి దేవాలయం

పెన్‌పహాడ్: మండల కేంద్రంలోని సీతారాంపురం కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ రామచంద్రస్వామి దేవాలయంలో గురువారం నుంచి ఈ నెల 13వరకు విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. గురువారం గణపతి పూజ, స్వస్తివాచనం, పంచగవ్య ప్రాసన, అఖండ దీపారాధన, అంకురారోపణ, రక్షాబంధనం, దీక్ష కంకణ వస్త్రధారణ, సాయంత్రం మంటప అవాహన దేవతల పూజ, మూలమంత్ర జపములు, హోమం, జలాధివాసం, మంగళ నీరాజనం, తీర్థప్రసాద వితరణ నిర్వహించనున్నారు. 12న మంట దేవతల పూజలు, మూలమంత్ర జపాలు, హోమం, ప్రతిష్ఠా మూర్తులకు అభిషేకం, మంగళ నీరాజనం, మంత్ర పుష్పం, సాయంత్రం దేవతాహ్వానం, ధాన్యాధివాసము, పుష్ప, ఫల, శయ్యాధివాసములు, మంగళ నీరాజనం, 13న ప్రాతఃకాల పూజలు, ప్రతిష్ఠ మూర్తులకు స్నాపనం మహా అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

కోదాడరూరల్ : విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని కోదాడ రూరల్ ఎస్ఐ ఎం.అనిల్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని మలిపుడి కాలనీలో గల గురుకుల కళాశాలలో సైబర్ నేరాలు, చట్టలపై పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి వ్యక్తిగత వివరాలు, ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు అడుగుతుంటారని ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దన్నారు. విద్యార్థులు ఇంటర్నెట్ టెక్నాలజీని చదువులో విషయ పరిజ్ఞానం కోసం మాత్రమే వాడుకోవాలని, సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్ట్‌లు పెట్టవద్దని తెలిపారు. చట్టలపై అవగాహన పెంచుకొవాలని శాంతిభద్రతలకు ఆటంకం కలిగించవద్దని చెప్పారు. వీటిపై తల్లిదండ్రులకు, ప్రజలకు కూడా అవగాహన కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవితారాణి, షీటీం కానిస్టేబుల్ శివరాం, శ్రీనివాసరావు, వెంకటనారాయణ, చంద్రశేఖర్, శ్రీనివాస్, యల్లయ్య, గోపి, నాగార్జున, కృష్ణాచారి తదితరులు ఉన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అనిల్

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు వేదమంత్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్య హోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రసవత్తరంగా రక్తిగట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభందనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణను తలంబ్రాల మహోత్సవంతో ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

'కానూరి'ని ఆదర్శంగా తీసుకోవాలి



దురాజ్‌పల్లి: కానూరి వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ఆత్మకూర్ (ఎస్): కానూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



నూతనకల్: కానూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకుడు కానూరి వెంకటేశ్వరరావు తన కళా రూపాలు, రచనల ద్వారా అసమానతల వ్యవస్థ మార్పునకు పోరాడారని సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1945లో సంప్రదాయ కళారంగం నుంచి ప్రజానాట్య మండలిలోకి ప్రవేశించిన కానూరి ఆనాటి నుంచి తుదిశ్వాస వరకూ కళారంగమే శ్వాసగా బతికారన్నారు. వారి ఆశయాన్ని సాధించే దిశగా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, ఉపాధ్యక్షుడు కూనుకుంట్ల సైదులు, జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు, జిల్లా కమిటీ సభ్యులు సామ నర్సిరెడ్డి, అరుణోదయ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : అరుణోదయ సంస్థల ద్వారా ప్రజలను చైతన్య వంతం చేసిన కానూరి వెంకటేశ్వరరావును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అరుణోదయ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్ర ఉమేష్ అన్నారు. బుధవారం వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆత్మకూర్ మండల కేంద్రంలో అరుణోదయ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఉమేష్ మాట్లాడుతూ అరుణోదయ సంస్థ స్థాపించి పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని, ప్రస్తుత ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో నవీన్, భాషపంగు రవీందర్, కళ్యాణ్, సుధాకర్, ఉప్పయ్య, మహేష్, శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కానూరు ఆశయ సాధనకు కృషి చేయాలి

నూతనకల్: అరుణోదయ వ్యవస్థాపక అధ్యక్షుడు కానూరి వెంకటేశ్వరరావు ఆశయ సాధనకు కృషి చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంటా నాగయ్య కోరారు. బుధవారం నూతనకల్ మండల కేంద్రంలోని గునగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రంలో కానూరి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కానూరి వెంకటేశ్వరరావు అరుణోదయ సంస్థను స్థాపించి ఎంతో మంది కళాకారులను తయారు చేసి గాయకులు, రచయితలుగా తీర్చిదిద్దిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు, గడ్డం శ్రీను, చీమల నరేష్, ముప్పాని మధు, గడ్డం పాపయ్య, పిల్లి లింగయ్య, మణికుమార్, మేడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

నాగారం: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కన్నెబోయిన సంజీవ, ఉపాధ్యక్షుడిగా నూన నరేష్, ప్రధాన కార్యదర్శులుగా కూరం వెంకన్న, కజ్జం సతీష్, కార్యదర్శులుగా పెద్దిని సైదులు, బొబ్బలి లింగమల్లు, కోశాధికారులుగా ఆకారపు శ్రీను, బారీ అనిల్, గౌరవ సలహాదారులుగా కజ్జం శివాజీ, బొల్లం యాదగిరి, మంగదుడ్ల దశరథ, మంగదుడ్ల అంజయ్య, కన్నెబోయిన అంజయ్యలతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కన్నెబోయిన వెంకన్న, మహేష్, సాయి, సోమయ్య, మల్లయ్య, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

నాగారం: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని ఏఈఓ రమ్యతేజ అన్నారు. బుధవారం నాగారం మండలంలోని నాగారం, ఫణిగిరి, ఈటూరు, మామిడిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం ఏ– గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, బీ– గ్రేడ్ ధాన్యానికి రూ.2,183 చొప్పున మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. రైతులు 17శాతంలోపు తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహేష్, నాగార్జున, శ్రీను, రామచంద్రయ్య, అవిలమల్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఈటూరులోని ఐకేపీ కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ రమ్యతేజ

ఆదాయమున్నా భక్తులకు అసౌకర్యాలే!



దండుమైసమ్మ ఆలయం



ఆలయ ఆవరణలో నిలిచిన మురుగు నీరు

- దండుమైసమ్మ ఆలయం వద్ద సౌకర్యాల కొరత
- చలువ పందిళ్లు లేక ఇబ్బందులు
- క్షౌరశాల కరువు, పారిశుద్ధ్యం అధ్వానం

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): ఆత్మకూర్‌లోని నెమ్మికల్ వద్ద గల దండుమైసమ్మ ఆలయంలో నెలకొన్న అసౌకర్యాలతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయంలో ఆదివారం, గురువారం భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి భక్తుల కానుకలతో దండుమైసమ్మ తల్లి ఆలయానికి దండిగా ఆదాయం వస్తుంటుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండేళ్ల క్రితం ఆలయ విస్తరణ పనులు చేపట్టి పూర్తిచేశారు. ప్రధాన ఆలయం పూర్తయినప్పటికీ ఇతర సౌకర్యాలు కల్పించడంలో ఆలయ పాలకవర్గం, దేవాదాయ శాఖ అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు.

క్షౌరశాలలు కరువు, అధ్వానంగా పారిశుద్ధ్యం

ప్రధాన ఆలయాన్ని విస్తరించడంతో పాటు ఆలయానికి ఇరువైపులా 200 మీటర్లకు పైగా రహదారిని విస్తరించారు. ఈ సమయంలో శిథిలావస్థకు చేరిన స్నానాల గదులను తొలగించారు. అప్పటి నుంచి నూతన గదులను ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా తలనీలాలను సమర్పించేందుకు వచ్చే భక్తుల కోసం క్షౌ రశాల లేదు. దీంతో పాటు ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. సమీపంలోని ఇళ్లు, దుకాణదారులు, ఆలయం వద్ద నిత్యం శుభ్రపరిచే చెత్తాచెదారాన్ని సైతం సమీపంలోనే వేస్తున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం చలువ పందిళ్లు లేకపోవడంతో ఎండలో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకవర్గం, అధికారులు స్పందించి దండుమైసమ్మ ఆలయం వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



దండుమైసమ్మ ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. నల్లగొండ జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల వారు సైతం వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ప్రధాన ఆలయం బాగానే ఉన్నప్పటికీ భక్తులకు సరైన సౌకర్యాలు లేవు. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. స్నానాల గదులు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

– ఉదయ్, భక్తుడు